క్లుప్తంగా

25 నుంచి కాశినాయన ఆరాధన ఉత్సవాలు

ఖాజీపేట : మండలంలోని పత్తూరు గ్రామంలో కాశిరెడ్డి నాయన ఆరాధన ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఈనెల 25వ తేదీ నుంచి రెండు రోజుల పాటు ఆరాధన ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేలా కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

26న సత్యనారాయణవ్రతం

కలసపాడు : స్థానిక లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో ఈ నెల 26వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ధార్మిక కార్యక్రమాలు, భజనలు, ప్రవచనాలు, కుంకుమ పూజలు పురోహితులు వారణాసివెంకటరమణయ్య అర్చకత్వంలో నిర్వహిస్తున్నట్లు టీటీడీ జిల్లా ధర్మ ప్రచార మండలి సభ్యులు తుపాకులశ్రీనివాసులు తెలిపారు. 26వ తేదీ పౌర్ణమి సందర్భంగా ఉదయం 9 గంటలకు సత్యనారాయణవ్రతం, సాయంత్రం రామాయణ ప్రవచనం ఉంటుందన్నారు. 27న మహాభారత ప్రవచనం, 28న భగవద్గీత ప్రవచనం, 29న మహిళామూర్తులచే కుంకుమపూజ, 30వ తేదీన భజన కార్యక్రమంతో కార్యక్రమం ముగుస్తుందని తెలిపారు.

పుస్తకాలు వితరణ

ప్రొద్దుటూరు : స్థానిక వైఎస్సార్ ఇంజనీరింగ్ కాలేజ్ ఆఫ్ యోగివేమన యూనివర్సిటీ గ్రంథాలయానికి విద్యార్థులు పుస్తకాలు వితరణగా అందించారని ప్రిన్సిపాల్ ఆచార్య సి.నాగరాజు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల గ్రంథాలయానికి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ డిపార్ట్ విద్యార్థులు జి.సంతోష్‌కుమార్, బి.మాధవి రూ.15వేలు విలువైన 25 పుస్తకాలు అందించారని ఆయన పేర్కొన్నారు.

కార్మికులను పర్మినెంట్ చేయాలి

ప్రొద్దుటూరు : ఈనెల 26 నుండి మున్సిపల్ కార్మికులు నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నట్లు ప్రొద్దుటూరు మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు తెలిపారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బి.విజయ్ కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి సాల్మన్, కోశాధికారి రాఘవేంద్ర మాట్లాడారు. మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని తెలిపారు.

ఘనంగా గీతాజయంతి



ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడు

కలసపాడు : స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలోని శ్రీకృష్ణ మందిరంలో శనివారం ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో గీతాజయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గీతా పారాయణం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మహా మంగళహారతి, తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

పిట్టిగుంటకు చేరిన అక్షింతలు

కాశినాయన : అయోధ్యలో 2024 జనవరి 22వ తేదీన రామమందిరంలో విగ్రహ ప్రతిష్ఠ జరుగుతున్న సందర్భంగా రాష్ట్రీయ స్వయం సేవక్, విశ్వహిందూ పరిషత్, జనహిత సంఘాల ఐక్యతతో అయోధ్య నుంచి అక్షింతలు రాష్ట్రాలు, జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాలకు వచ్చాయి. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం మండలంలోని పిట్టిగుంట గ్రామానికి చేరిన అక్షింతలను డప్పు వాయిద్యాలు, కోలాటాలు, భజనలతో ఊరేగింపుగా తీసుకొచ్చారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సేవకు పురస్కారం

పోరుమామిళ్ల : ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ గీతకు శుక్రవారం తెలంగాణ ప్రభుత్వం సేవా పురస్కారాన్ని అందచేసింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. 23 సంవత్సరాలుగా డాక్టర్ గీత, చిత్తా తోమాస్‌రెడ్డితో కలసి చేస్తున్న పలు సేవాకార్యక్రమాల నేపథ్యంలో పురస్కారం లభించింది.

మసీదు నిర్మాణానికి భూమి పూజ



మసీదు నిర్మాణానికి భూమి పూజ చేసి దువా చేస్తున్న ముస్లిం మత పెద్దలు

ప్రొద్దుటూరు : మండలంలోని అమృతానగర్ మదూరు క్రాస్ రోడ్డులో నూతన మసీదు నిర్మాణానికి శనివారం ముఫ్తీ అబ్దుల్ వహబ్ భూమి పూజ చేసి దువా చేశారు. మసీదు కోసం 5 సెంట్ల భూమిని షేక్ అమీర్ బాషా విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో స్థల దాత కుటుంబీకులు, షేక్ అన్వర్ బాషా, గౌసల్ లాజం, రిటైర్డు హెచ్‌ఎం ఐరస్ మౌలాన, తౌహీద్ హఫీజ్, జావీద్, మౌలానా, సమీర్, మహబూబ్ ఇలాహ, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి వేడుకలు



ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రత్యేక అలంకరణలో బొల్లవరం ప్రసన్న వేంకటేశ్వరస్వామి



ప్రొద్దుటూరు కల్చరల్ : గరుడ వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరుడు



బద్వేలు: లక్ష్మీపాలెంలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో..



బ్రహ్మంగారిమఠం: ప్రత్యేక అలంకణలో వీరబ్రహ్మేంద్రస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని పలు వైష్ణవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక పాతమార్కెట్‌లోని శ్రీమహాలక్ష్మీసమేత చెన్నకేశవస్వామి ఆలయంలో భక్తులు తెల్లవారుజాము 2 గంటల నుంచి ఆలయం వద్ద క్యూలో నిల్చున్నారు. చెన్నకేశవస్వామి, మహాలక్ష్మీదేవి మూలవిరాట్‌లను శోభాయమానంగా అలంకరించారు. ఈఓ జగన్‌మోహన్‌రెడ్డి, పోలీసులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. బొల్లవరంలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం వెలుపల భక్తులు క్యూ కట్టారు. శ్రీదేవిభూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరునికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి సుందరంగా అలంకరించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను గరుడ వాహనంపై ఉంచి ప్రాకారోత్సవాన్ని గోవింద నామస్మరణల మధ్య నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోనా ప్రభాకరరెడ్డి, ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. మెయిన్‌బజారులోని రామాలయం, రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీ కృష్ణాలయం తదితర ఆలయాల్లో ఉత్తర ద్వారం గుండా స్వామివారిని దర్శించుకున్నారు.

ఆలయాల్లో పూజలు

రాజుపాళెం : వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని శనివారం మండలంలోని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వెల్లాల ఆలయాల్లో శ్రీచెన్నకేశవ, సంజీవరాయస్వాముల ఆలయాల్లో భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. ఆలయంలో పగిడాల కోదండరామస్వామి భజన సంఘం సభ్యులు భజన పాటలు పాడారు. గాదెగూడూరులోని వల్లభరాయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఉత్తరద్వార దర్శనం.. పాప విమోచనం

బద్వేలు అర్బన్ : ముక్కోటి (వైకుంఠ) ఏకాదశిని పట్టణ ప్రజలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.పట్టణానికి సమీపంలోని లక్ష్మీపాలెం గ్రామంలో వెలిసిన శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం, స్థానిక నెల్లూరు రోడ్డులోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయ సందర్శనకు వచ్చారు. ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో గరుడ వాహనంపై, నెల్లూరురోడ్డులోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శేషవాహనంపై స్వామివారు ఉత్తరద్వార దర్శనమిచ్చారు. సిద్దవటంరోడ్డులోని ఫైర్ ఆఫీస్ వెనుకభాగంలో ఉన్న శ్రీమహాలక్ష్మీ గోదాదేవి సహిత వేంకటేశ్వర స్వామి ఆలయంలో, తెలుగుగంగకాలనీలోని అనంతపద్మనాభస్వామి ఆలయాలలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఆయా ఆలయాల చైర్మన్లు బాదిరెడ్డివెంకటరామిరెడ్డి, మెంటాఅశోక్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు కల్చరల్ : చెన్న కేశవస్వామి ఆలయం వద్ద క్యూలైన్‌లో భక్తులు

పోరుమామిళ్ల మండలంలో..

పోరుమామిళ్ల : వైకుంఠ ఏకాదశి సందర్భంగా మండలంలోని వైష్ణవాలయాలు శనివారం భక్తులతో కిటకిటలాడాయి. కాలువకట్ట తిరుమలగిరిపై వెలసిన శ్రీ లక్ష్మీదేవి గోదాదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఉత్తర ద్వారం ఏర్పాటుచేశారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ధర్మకర్త మోటపోతుల తిరుపేలయ్య, అధ్యక్షుడు చాటకొండు సత్యనారాయణ కమిటీసభ్యులు, దాతల సహకారంతో భక్తులకు ప్రసాదం, మధ్యాహ్నం అన్నదానం పంపిణీ చేశారు. పట్టణంలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి, శ్రీ వేణుగోపాల స్వామి, శ్రీ లక్ష్మీకాంతస్వామి, శ్రీ కన్యకాపరమేశ్వరీ దేవి, చల్లగిరిగెల శ్రీ పట్టాభి రామస్వామి ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

బి.కోడూరు మండలంలో..

బి.కోడూరు : ముక్కోటి ఏకాదశిని మండలంలో ఘనంగా నిర్వహించారు. శనివారం మండలంలోని మేకవారిపల్లె వద్ద గల అఖిలాండకోటి బ్రహ్మానంద ఆశ్రమం, రెడ్డివారిపల్లె గ్రామంలో గల ఆశ్రమం, మున్నెల్లిలోని చెన్నకేశవస్వామి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

కాశినాయనమండలంలో..

కాశినాయన : మండలంలో శనివారం వైకుంఠ ఏకాదశి పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జ్యోతిక్షేత్రం, వరికుంట్ల తిప్ప వద్ద ఉన్న పద్మనాభస్వామి ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పూజాల్లో పాల్గొన్నారు.

బి.మఠంలో..

బ్రహ్మంగారిమఠం: వైకుంట ఏకాదశి సందర్భంగా బ్రహ్మంగారిమఠంలో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. జిల్లా నలుమూలల నుంచి బ్రహ్మంగారి దర్శనం కోసం భక్తులు తరలి వచ్చారు. ఈశ్వరీదేవి మఠంలో వైకుంట ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వాసవీ మాతకు సహస్ర దీపాలంకరణ



ప్రొద్దుటూరు కల్చరల్ : సహస్ర దీపాలంకరణ సేవలో వాసవాంబ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో శనివారం వాసవిమాత వైకుంఠ ఏకాదశి పర్వదిన సందర్భంగా వజ్రపు చీరె, కిరీటధారణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున అమ్మవారికి పంచామృతాభిషేకం, గో క్షీరాభిషేకం, కుంకుమార్చనలు, పుష్పార్చన వంటి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారిని విశేషంగా వజ్రపు చీరె, కిరీటంతోపాటు బెంగళూరు నుంచి తెప్పించిన వివిధ రకాల పూలతో అలంకరించారు. తెల్లవారుజామున అమ్మవారి గర్భగుడిలో సహస్ర దీపాలంకరణ సేవ చేశారు. ఉత్తరద్వారం గుండా భక్తులు వెళ్లి ఆదిశేషునిపై శ్రీమహావిష్ణువును దర్శించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహన్‌రావు, కార్యదర్శి మురికి నాగేశ్వర రావు, సభ్యులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



రాజుపాళెం : తాళిబొట్టును చూపిస్తున్న అర్చకులు



రాజుపాళెం : కల్యాణానికి తరలివచ్చిన మహిళలు

రాజుపాళెం : వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని మండలంలోని అర్కటవేములలోని వేణుగోపాల, వీరాంజనేయ స్వాముల ఆలయాల్లో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. వంశ పారంపర్య ఆలయ అర్చకులు క్రిష్ణపాటి వెంకటాచార్యులు కుమారుడు నందకిషోర్, గ్రామస్తులు, భక్తుల సహకారంతో ఈ కల్యాణాన్ని నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు. భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వాములను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఊరేగించారు. మహిళలు చేసిన కోలాటం అలరించింది.

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన స్వయంభు లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో శనివారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకం, తిరుకల్యాణ మహోత్సవం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. బద్వేలు పట్టణానికి చెందిన ప్రముఖ వస్త్ర వ్యాపారి చిన్నినరసింహ కుటుంబ సభ్యులు స్వామివారి కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

సీఎం జగన్‌తోనే విద్యాభివృద్ధి

ప్రొద్దుటూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో విద్యాభివృద్ధి జరుగుతోందని మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి తెలిపారు. స్థానిక 16వ వార్డులోని 18వ సచివాలయం వద్ద శనివారం ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన బడి నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించారన్నారు. మున్సిపాలిటీల్లోని అన్ని పాఠశాలల్లో రూ.కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లు, విద్యాకానుక, వసతి దీవెన, విద్యాదీవెన పథకాలతో లబ్ధి పొందుతున్నారన్నారు. విద్యార్థులు ఇంగ్లీషు మీడియం, బైజూస్ ద్వారా నాణ్యమైన పాఠాలు బోధిస్తున్నట్లు తెలిపారు. సచివాలయం పరిధిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు.



ప్రొద్దుటూరు : వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మోపూరు శ్రీనివాసులరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు కామిశెట్టి బాబు, కోనేటి సునంద, కౌన్సిలర్లు కమాల్ బాషా, సత్యం, జిలాన్, గౌస్, కోఆప్షన్ సభ్యుడు మల్లికార్జున ప్రసాద్ యాదవ్, రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పన్నీటి కాశయ్య, రామకృష్ణ, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

భగవద్గీతను పఠించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : భగవద్గీతను ప్రతి ఒక్కరూ పఠించాలని శివదర్శనానంద సరస్వతి మాతాజీ పేర్కొన్నారు. స్థానిక గోల్డెన్ పార్కులో శనివారం రాత్రి గీతాజయంతి సందర్భంగా జిల్లా స్థాయి భగవద్గీత పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భగవద్గీతను చదవడం వలన మంచి చెడు విచక్షణ జ్ఞానం తెలుస్తుందన్నారు. భగవద్గీత పఠన పోటీల్లో పదివేల మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. నిర్వాహకుడు పల్లేటి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో 29 స్కూళ్లకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. జిల్లా స్థాయిలో 200 మంది విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశామన్నారు. భగవద్గీత గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ విజయేశ్వరి, డాక్టర్ రామమునిరెడ్డి, గీతాంజలి హైస్కూల్ కరస్పాండెంట్ శివరామిరెడ్డి, రవీంద్ర హైస్కూల్ కరస్పాండెంట్ విష్ణు కుమార్‌రెడ్డి, రిటైర్డు ప్రిన్సిపాల్ కళావతి, పలు పాఠశాలల యాజమాన్యాలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. స్థానిక ఇస్కాన్ కేంద్రంలో గీతా జయంతి సందర్భంగా భగవద్గీత పఠనం జరిగింది.



జిల్లా స్థాయి భగవద్గీత పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

క్రిస్మస్ కానుకల పంపిణీ

ప్రొద్దుటూరు : స్థానిక సీఎస్ఐ చర్చి ఆవరణలో శనివారం 19వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి నీలాపురం చాంద్‌బాషా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి 200 మంది నిరుపేదలకు క్రిస్మస్ కిట్లను పంపిణీ చేశారు. క్రిస్మస్ పండుగను సంతోషంగా నిర్వహించుకోవాలని ఒక్కొక్కరికి రూ.1300 విలువైన నిత్యావసర సరుకులను అందించినట్లు చాంద్ బాషా తెలిపారు. పేదలకు సహాయం అందించిన చాంద్ బాషాను ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అభినందించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తమకు తోచినంత పేదలకు సహాయం అందిస్తున్నారని ఆయన తెలిపారు. అంతకుముందు చర్చిలో పాస్టర్లు నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాస్టర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



క్రిస్మస్ కానుక అందిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

అంగన్‌వాడీల ఆందోళన

ప్రొద్దుటూరు : సీఐటీయూ, ఏఐటీయూసీ అనుబంధ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం 12వ రోజు ఆందోళన కొనసాగించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు స్థానిక మైదుకూరు రోడ్డులోని సీఎస్ఐ చర్చి వద్ద ప్రార్థనలు చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు మంజుల మాట్లాడారు.

అంగన్‌వాడీల రిలే నిరాహార దీక్ష

దువ్వూరు : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్లు, సహాయకులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు ఆయేషా, కవిత మాట్లాడారు. పని భారం తగ్గించాలని, మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్వాడీలుగా మార్చాలని, తమ డిమాండ్లను పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు.

నాక్ గ్రేడ్ పట్ల హర్షం

ప్రొద్దుటూరు : స్థానిక ఎస్‌సీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాక్ బీ ప్లస్ గ్రేడ్ రావడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ చంద్రమోహన్, కళాశాల పూర్వ భౌతిక శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ జీవీ లోకేశ్వర్‌రెడ్డి, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. ఈనెల 18, 19 తేదీల్లో కళాశాలను చైర్‌పర్సన్ ప్రొఫెసర్ విజయ దేశముఖ్, కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఖాద్రి, మెంబర్ డాక్టర్ అనిరుద్ భార్గవన్ సందర్శించారని ప్రిన్సిపాల్ తెలిపారు. వారు కళాశాలలో మౌలిక వసతులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, జేకేసీ, ల్యాబ్స్, జాబ్ ప్లేస్‌మెంట్, ఐక్యూఏసీ, జిమ్ తదితర వాటిని పరిశీలించారన్నారు. అన్ని అంశాలను పరిగణలోకి తీసుకున్న నాక్ వారు కళాశాలకు బీ ప్లస్ గ్రేడ్ ఇచ్చారని తెలిపారు. దీంతో కళాశాలకు అటానమస్ హోదా లభిస్తుందని చెప్పారు.

మోడల్ పేపర్ల ఆవిష్కరణ

ప్రొద్దుటూరు : స్థానిక నడింపల్లె ఉర్దూ ఉన్నత పాఠశాలలో శనివారం యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాళెం మహేష్‌బాబు, జిల్లా కార్యదర్శి రవీంద్రుడు పదో తరగతి మోడల్ పేపర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు, ఇంగ్లీషు మీడియంలో అన్ని సబ్జెక్టుల మోడల్ పేపర్లను రూ.75 అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఇమామ్ హుస్సేన్, యూటీఎఫ్ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాధర్, గంగన్న, గౌరవాధ్యక్షుడు కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పోరుమామిళ్ల : పోరుమామిళ్లలో అంగన్వాడీల సమ్మె కొనసాగుతోంది. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు భైరవప్రసాద్ మాట్లాడుతూ అంగన్వాడీల వేతనాలు పెంచాలన్నారు.

ఆడుదాం ఆంధ్రను విజయవంతం చేయాలి

దువ్వూరు : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ ఓబులేసు నందన్, ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి తెలిపారు. శనివారం దువ్వూరులోని ఎంపీడీఓ కార్యాలయం నుంచి అధికారులు విద్యార్థులతో కలసి పుల్లారెడ్డిపేటలోని డిగ్రీ కాలేజి వరకు ఆడుదాం – ఆంధ్ర ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 26 నుంచి జనవరి 6వ తేదీ వరకు గ్రామ స్థాయిలో క్రీడలు నిర్వహిస్తారని, జనవరి 10 నుంచి 22వ తేదీ వరకు మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. మానసిక ఒత్తిడిని జయించాలంటే క్రీడలు చాలా అవసరమని చెప్పారు. మండలంలోని యువకులు, ఉద్యోగులు ఈ పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సచివాలయ సిబ్బందికి క్రీడా సామాగ్రిని అందించారు. ఈకార్యక్రమంలో మండలంలోని పీఈటీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

‘ఆడుదాం ఆంధ్ర’ క్రీడా పోటీల ర్యాలీ

బ్రహ్మంగారిమఠం : ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల అవగాహన ర్యాలీని శనివారం బ్రహ్మంగారిమఠంలో ఎంపీపీ సి. వీరనారాయణరెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు ఆడుదాం ఆంధ్రా క్రీడలను నిర్వహించాలని తెలపడంతో క్రీడల పట్ల ఆశక్తి ఉన్న పిల్లలు ఆన్‌లైన్‌ద్వారా దరఖాస్తు చేసుకొని క్రీడలలో పాల్గొంటున్నట్లు తెలిపారు. బి.మఠం మండలం జిల్లా స్థాయికి వెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు పుల్లయ్య, వెంకటేశ్వర్లు, జిల్లా యూత్ ఆర్గనైజర్ సెక్రటరీ ఆవుల దస్తగిరి, దీప్తి రమణారెడ్డి, ఎంపీడీఓ కార్యాలయం పరిపాల అధికారి మల్లికార్జున, వైఎస్సార్‌సీపీ నాయకులు పాలరామిరెడ్డి, జోగయ్య, గాజుల రామయ్య, సుబ్బరాజు, బోలా శ్రీను, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

సీఎంకు వినతుల వెల్లువ



పశుక్రాంతి ద్వారా దాణా పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్న మాధవరెడ్డి



సోమశిల ముంపు గ్రామాలకు నష్టపరిహారం చెల్లించాలని వినతి పత్రం ఇస్తున్న నాయకులు

అట్లూరు : జిల్లాలో కరువు ఛాయలు అలుముకున్నాయి పశువులకు దాణా పంపిణీ చేయాలని జిల్లా పశుగణాభివృద్ధి సంఘం చైర్మన్ రొండా మాధవరెడ్డి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కోరారు. శనివారం గోపవరం మండల పరిధిలోని సెంచురీ ఫైవుడ్ కంపెని ప్రారంభానికి వచ్చిన ముఖ్యమంత్రిని కలసి సమస్య విన్నవించారు.

ముంపు పరిహారం చెల్లించి ఆదుకోండి

సోమశిల చివరి ముంపు గ్రామాలైన ఆకుతోటపల్లి, చింతువాండ్లపల్లి తదితర గ్రామాలకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి అందూరు రామకృష్ణారెడ్డి, మండల కన్వీనరు ముడమాల ప్రభాకర్‌రెడ్డి, అటవీశాఖ కార్పొరేషన్ డైరెక్టరు మల్లికార్జునరెడ్డి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ని కలసి వినతి పత్రం అందజేశారు.



సీఎం జగన్ మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బద్వేలు బూత్ కన్వీనర్ల సమన్వయకర్త రమణారెడ్డి